క్లుప్తంగా

ఘనంగా గణపతి చండీయాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి మహంకాళి దేవస్థానంలో శుక్రవారం శ్రీలక్ష్మి గణపతి రుద్ర సహిత చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

12న నేషనల్ అప్రెంటిషిప్ మేళా

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఎదుట గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 12న ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ దేవానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్రెంటిషిప్ కోసం హైదరాబాద్‌లోని పలు బహుళజాతి కంపెనీలతో పాటు స్థానిక కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి 12న ఉదయం పది గంటలకు కళాశాలకు వస్తున్నారని ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపల్ సూచించారు.

పవర్‌ప్లాంట్ కార్మికుల నిరాహార దీక్షకు మద్దతు

పాతమంచిర్యాల: శాలీవాహన పవర్‌ప్లాంట్ కార్మికులు తమకు ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్‌లు, వేతనాల బకాయిలు చెల్లించాలని 10రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. కాగా పవర్‌ప్లాంట్ కార్మికుల దీక్షకు మద్దతుగా మంచిర్యాల పట్టణ ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మద్దతు ప్రకటించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జుబేర్

నెన్నెల: విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి 'అనిమియా ముక్త తెలంగాణ'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ రక్తపరీక్షలు నిర్వహించినట్లు ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి జుబేర్‌సాహిల్ తెలిపారు. 100మంది విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయగా, పది మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. హిమోగ్లోబిన్ శాతం 10లోపు ఉన్న వారికి ఐరన్ మాత్రలు అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఫార్మాసిస్ట్ రుక్మిణి, ఏఎన్ఎం స్వప్న, హెచ్ఎం ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్పాదకత పెంచాలి

శ్రీరాంపూర్: ఉత్పాదకత పెంచాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 7 గనిపై శుక్రవారం మల్టీడిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ చర్యలు, ఉద్యోగుల సంక్షేమం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, ఏజెంట్ రాముడు, మేనేజర్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకం కోసం వివరాల సేకరణ



మందమర్రిరూరల్: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం హామీ కోసం ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లేమూరులో విద్యుత్ సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరించారు. నెలకు 200యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం వర్తిస్తుందని సిబ్బంది పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి రేషన్, ఆధార్ కార్డు, గృహజ్యోతి రిసెప్ట్ నంబర్స్‌ను ఆన్‌లైన్లో పొందుపరుస్తున్న ట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. అసిస్టెంట్ లైన్‌మెన్ రవీందర్, జూనియర్ లైన్‌మెన్ సతీష్, స్పాట్ బిల్లర్స్ నాగరాజు ఉన్నారు.

కాంగ్రెస్ ఖాతాలోకి మున్సిపాలిటీలు..!

- ఏకగ్రీవంగా నస్పూర్, మంచిర్యాల చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్న కౌన్సిలర్లు
- హాజరైన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు

జిల్లాలో నస్పూర్, మంచిర్యాల మున్సిపాలిటీలు శుక్రవారం కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. మంచిర్యాలలో చైర్మన్‌గా రావుల ఉప్పలయ్యను, వైస్ చైర్మన్‌గా సల్ల మహేశ్‌ను, నస్పూర్‌లో చైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్‌గా గెల్లు రజితను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మున్సిపల్ చైర్మన్ వేణు, వైస్ చైర్‌పర్సన్ రజితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్: మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభమైంది. సమావేశానికి 25మంది సభ్యులలో 16మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీసియో మెంబర్‌గా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు హాజరయ్యారు. ప్రిసైడింగ్ అధికారిగా జెడ్పీ సీఈఓ నరేందర్ వ్యవహరించారు. చైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్‌గా గెల్లు రజితను పలువురు సభ్యులు బలపర్చగా ఎన్నికకు 13మంది సభ్యులు అవసరం కాగా, 16మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఎక్స్ అఫీసియో మెంబర్ ఓటుతో కలిపి మొత్తం 19మంది సభ్యులు చేతులు పైకెత్తి చైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్‌గా గెల్లు రజితలకు మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ చైర్ పర్సన్‌గా గెల్లు రజిత ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ప్రిసైడింగ్ అధికారి నరేందర్ ప్రకటించి చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ సతీష్, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి మాజీ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌తో సహా ఆరుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఒక కాంగ్రెస్ కౌన్సిలర్ కెడిక ప్రకాశ్‌రెడ్డి గైర్హాజరయ్యారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజితలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేం సాగర్ రావు మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన నూతనంగా ఎన్నికైన చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజితలకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనను నిరసిస్తూ పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తమ పార్టీలో చేరి, తమకు మద్దతు తెలిపారని, వారికి ధన్యవాదాలని అన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కాగా మున్సిపాలిటీని కాంగ్రెస్ చేజిక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ఇంటికి బైక్ ర్యాలీగా బయలు దేరి వెళ్లారు.

మంచిర్యాలలో...



నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేశ్‌తో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ప్రశాంతంగా, ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రిసైడింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో వాడాల రాములు తెలిపారు. కొన్ని రోజులుగా క్యాంపునకు వెళ్లిన కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో నేరుగా మంచిర్యాల మున్సిపల్ కార్యాలయానికి 26మంది చేరుకోగా, ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోరంకు కావాల్సిన 18మంది కౌన్సిలర్లకు గాను 26మంది హాజరు కావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికను నిర్వహించగా చైర్మన్‌గా 30వ వార్డుకు చెందిన కౌన్సిలర్ రావుల ఉప్పలయ్యను 13వ వార్డు కౌన్సిలర్ నల్ల శంకర్ ప్రతిపాదించగా, 3వ వార్డు కౌన్సిలర్ షేక్ మాజీద్ బలపరిచారు. మరొకరు పోటీగా నిలవకపోవడం, 26మంది సభ్యులు ఏకగ్రీవంగా చైర్మన్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా 2వ వార్డుకు చెందిన సల్ల మహేశ్‌ను 24వ వార్డు కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ ప్రతిపాదించగా, 23వ వార్డు బానేశ్ బలపరచగా, 26మంది కౌన్సిలర్ల మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి రాములు చేయించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చైర్మన్ చాంబర్‌లో నూతన చైర్మన్‌ను కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు.

భూదాన్ భూమి కబ్జాపై అధికారుల చర్యలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో ఉన్న సర్వే నంబర్ 707, 708లో ఉన్న ప్రభుత్వ భూదాన్ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారని మంచిర్యాల ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ట్రెంచ్ కొట్టి చర్యలు తీసుకోవడంపై ఆమ్ ఆద్మీపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీపార్టీ నేతలు నాగేంద్రప్రసాద్, నయీం పాష మాట్లాడుతూ.. కాలేజీరోడ్డులోని భూదాన్ భూమిని కబ్జా చేసినట్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో, స్పందించిన అధికారులు వెంటనే ఆ భూమిలోకి వెళ్లే దారిలో ట్రెంచ్ కొట్టి, దారిని మూసేశారని, ఇలాంటి కబ్జాలు మరోసారి కాకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చిన్నయ్య

భీమారం: మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుధ్య పనులను శుక్రవారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి చిన్నయ్య పరిశీలించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజలు వారి ఇళ్ల పరిసరాల్లో శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమారం: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్, ఆవుల సురేష్ శుక్రవారం తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకొని, కళాశాలను మంజూరు చేయాలని కోరారు.

సామగ్రికి భద్రత కరువు..!

- విచ్చలవిడిగా దొంగతనాలు
- కనీస బాధ్యత లేని సిబ్బంది
- సీసీ కెమెరాలను కూడా లెక్కచేయని దొంగలు



కేకే-5 గనిపై విచ్చలవిడిగా పడి ఉన్న సామగ్రి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి సామగ్రికి భద్రత కరువైంది. అవసరాల అనంతరం వినియోగించిన సామగ్రిని ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పడేయడంతో దొంగలకు దోపిడీ చేయడానికి సులువుగా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఏరియాలో ఎన్నిసార్లు దొంగతనాలు జరిగినా అధికారులు మేల్కొకపోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దానికి తోడు సామగ్రిని కాపాడాల్సిన సెక్యూరిటీ సిబ్బంది కూడా అదే తీరుగా ఉండడంతో విలువైన సామగ్రి దొంగల పాలవుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పనికిరాని స్క్రాప్ సామగ్రిని ప్రత్యేక చోట భద్రపర్చాలని, లేకుంటే ఉన్నచోటే ప్రత్యేక ప్రహరీ గోడలు నిర్మించాలని పలువురు సూచిస్తున్నారు.

బాధ్యత లేకుండా...

మందమర్రి ఏరియాలో బెల్లంపల్లి, కాసిపేట, మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో సింగరేణి సంస్థ ఆస్తులు ఉన్నాయి. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ (ఏఎస్‌వో)తో పాటు సీనియర్ ఇన్స్‌స్పెక్టర్, జూనియర్ ఇన్స్‌స్పెక్టర్లు, జమేదార్లు, సెక్యూరిటీ గార్డులు 130మంది వరకు ఉండగా రెండు ప్రైవేట్ సెక్యూరిటీల నుంచి సుమారు 150మంది వరకు విధులు నిర్వర్తిస్తుంటారు. విధి నిర్వహణలో దొంగతనం జరిగే సమయంలో సిబ్బంది నివారించే ప్రయత్నం చేయాలి. ఎదుర్కొనే పరిస్థితి లేని పక్షంలో వెంటనే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి దొంగతనం జరుగకుండా నివారించాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అలా జరగడం లేదు. దొంగలు సామగ్రి కోసం వచ్చారంటే సీసీ కెమెరాలు ఉన్నా లెక్కచేయకుండా ఖచ్చితంగా సామగ్రి దొంగతనం కావాల్సిందే. ఆ సమయంలో భద్రత సిబ్బంది ప్రతిఘటించక పోవడంతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కేకే-5 గనిపై దొంగతనం జరిగిన విధానం చూస్తే సిబ్బంది కనుసన్నల్లోనే దొంగలు విలువైన కేబుల్ చోరీ చేశారనే విధంగా ఉందని పలువురు అనుకుంటున్నారు. కూత వేటు దూరంలోనే మ్యాన్‌వే ఆఫీస్ కూడా ఉంది. దొంగలు విలువైన కేబుల్ దొంగిలిస్తున్నా, కనీస బాధ్యతతోనైనా మ్యాన్‌వే క్లర్క్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. విధి నిర్వహణలో ఎంత విలువైన సామగ్రి చోరీకి గురైనా, సిబ్బందికి ఎలాంటి పనిష్మెంట్ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇష్టారీతిగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకం..?

ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ నియామకం నియమ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. సింగరేణి సెక్యూరిటీ గార్డుల పదవీ విరమణ, తిరిగి సెక్యూరిటీ గార్డుల నియామకాలు లేకపోవడంతో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకాల అవసరం ఏర్పడింది. దీంతో గతంలో కొంతమంది సెక్యూరిటీ గార్డులను నియమించే సమయంలో సింగరేణిలో భూములు కోల్పోయిన వారి కుటుంబీకుల, సింగరేణి సంస్థలో ఉద్యోగం చేసి రిటైర్మెంట్ అయిన వారి వారసులకు షరతులతో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా ఎంపిక చేసేవారు. కానీ కొంత కాలంగా అలాంటి నిబంధనలు పాటించకుండా కొంతమంది అధికారులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కాంట్రాక్టర్‌తో మిలాఖతై 'మామూళ్లు' గా నియామకాలు చేపట్టడం వల్లనే వారికి ఎలాంటి నియమాలు తెలియడం లేదని, మరో వైపు దొంగలకు అనుకూలమైన వారే ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిగా నియామకం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే దొంగతనం జరిగే సమయంలో ఎలాంటి ప్రతిఘటన చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గతంలో జరిగిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకాలపై విచారణ జరిపిస్తే, ఇప్పటి నుంచైనా దొంగతనాలు జరగకుండా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే 1ఏ పాలవాగు ఒడ్డున ఈ నెల 21 నుంచి 24వరకు నిర్వహించనున్న సమ్మక్క జాతర ఏర్పాట్లను శుక్రవారం ఏరియా జీఎం మనోహర్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్తు, రోడ్డు సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటుజీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఆర్కే1ఏ మేనేజర్, జయంత్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేఖ విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే సార్వత్రిక గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జాతీయ కార్మిక సంఘాల నాయకులతో సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఢిల్లీలో నిర్వహించిన రైతాంగా పోరాటాలకు తలొగ్గిన బీజేపీ ప్రభుత్వం, ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకుండా మాటల గారడి చేస్తుందన్నారు. ప్రజాస్వామిక హక్కులను హరించివేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మండల, జిల్లా కేంద్రాల్లో జరుగు నిరసన ప్రదర్శనలు, ర్యాలీలను విజయవంతం చేయాలన్నారు. సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఐఎఫ్‌టీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి తూముల శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు సంకె రవి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు విశ్వనాథ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌నాయుడు, టీఎన్‌టీయూసీ జిల్లా నాయకులు మునిరాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రదర్శన



దండేపల్లి: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024లో భాగంగా గురువారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలను శుక్రవారం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శనగా అతికించారు.

వినతిపత్రం అందజేత



వేమనపల్లి: ఈ నెల 16వ తేదీన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టే సమ్మెకు అనుమతి ఇవ్వాలని ఎస్‌హెచ్ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపుయాదవ్ ఆధ్వర్యంలో వేమనపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

ఈజీఎస్ పనులు పర్యవేక్షించిన డీఆర్‌డీఓ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి, నర్సింగాపూర్ గ్రామాల్లో ఈజీఎస్ కింద చేపడుతున్న పనులను శుక్రవారం డీఆర్‌డీఓ శేషాద్రి ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈజీఎస్ కింద చేపడుతున్న భూమి చదును, మట్టి రోడ్డు నిర్మాణాల పనులను పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌హై, నాయబ్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి హరిత, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, కార్యదర్శులు వెంకటస్వామి, సరిత పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: మార్చి నెల 3, 4 తేదీల్లో నిర్వహించే సీపీఐ ఎంఎల్ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని శుక్రవారం చెల్లంపేటలో పోస్టర్ ఆవిష్కరించారు. జాతీయ మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద మొత్తంలో హాజరై సమావేశాలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం భవిష్యత్ కార్యచరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, నాయకులు రమాదేవి, సురేష్, పోచన్న, బాపు, లక్ష్మక్క, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వేమనపల్లి: ఎస్ఆర్ ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తున్నట్లు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఆర్.స్వర్ణలత, సంతోష్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి ఆదేశాలతో శుక్రవారం వేమనపల్లి మండలంలోని గొర్లపల్లి, సుంపుటం, బుయ్యారం, సూరారం, జిల్లెడ, నాగారాం గ్రామపంచాయతీల్లో రూ.కోటి 15లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య కార్యక్రమాల్లో స్థానికులు విధిగా భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. కార్యక్రమాల్లో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

వేమనపల్లి: వేమనపల్లి, నీల్వాయి గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. డంపింగ్‌యార్డు, పారిశుధ్య పనులను అధికారులు పరిశీలించారు.

నిత్యావసరాలు అందజేత

జన్నారం: నిరుపేదలకు సేవలందించాలనే ఉద్దేశంతో సామాజిక సంక్షేమ కమిటీ ఏర్పాటు చేసి వృథా ఖర్చు చేయకుండా, ఆ డబ్బులను సేవకు ఉపయోగిస్తూ గ్రామస్తులు ఉదారత చాటుకుంటున్నారు. జన్నారం మండలం రోటిగూడలో సామాజిక సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 20మంది నిరుపేదలకు రూ.50వేల విలువ గల నిత్యావసర సరుకులు అందజేసి ఉదారత చాటుకున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. సుదీర్ఘకాలం పాఠశాలలో పనిచేసిన యోగేశ్వర్ పాఠశాల గ్రంథాలయానికి విలువైన పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఆసూరి వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, యోగేశ్వర్‌లు బీరువాను బహూకరించారు. వీరితో పాటు శ్రీనివాస్, మహేష్, నాగరాజ్, గోలిమనోహర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం దుర్గయ్య, ఉపాధ్యాయులు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ మెటీరియల్ అందజేత

మంచిర్యాలటౌన్: మహిళా తరంగిణి ఆధ్వర్యంలో శుక్రవారం కేజీబీవీ పాఠశాలకు రూ.12,270విలువ గల ల్యాబ్ మెటీరియల్‌ను అందించారు. విద్యార్థులందరూ చదువుకోవాలని, సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. మమత ఫౌండర్స్ గోనె భాగ్యలక్ష్మి, గోనె ఇందిర, అధ్యక్షురాలు శ్రీదేవి గౌడ్, సెక్రటరీ పద్మారెడ్డి, చిదానంద కుమారి, జ్యోత్స్న, చంద్రదత్, కోశాధికారి భాగ్యలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో మంచిర్యాల రవాణ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ శ్రీకాంత్ రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులకు వివరించారు. అతివేగం ప్రమాదకరం, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దన్నారు, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. రవాణ శాఖ సిబ్బంది, ఆటో, ఇతర వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

భీమిని: రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో కన్నెపల్లి ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించారు. ముత్తాపూర్ గ్రామపంచాయతీ నుంచి మెట్‌పల్లి, నాయకునిపేట వరకు ముళ్ల పొదలను జేసీబీతో తొలగించారు.